
సాక్షి
విజయనగరం

సోమవారం । 15 । మే । 2023



ఔషధ గుణాలు మెండు

విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్‌ఫ్రూట్‌ను చూడడమే అరుదు.

- 8లో



హనుమాన్ శోభాయాత్ర

హనుమత్ జయంతిని పురస్కరించుకుని భారీ హనుమాన్ విగ్రహంతో పట్టణంలోని కోట జంక్షన్ వద్ద ఆదివారం పూజలు నిర్వహించారు.

- 8లో



రాజాం విద్యార్థుల సత్తా

మాస్టర్ సాయిబాబా మెమోరియల్ నేషనల్ లెవెల్ కుంగ్-ఫూ అండ్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో రాజాం పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు.

- 8లో

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో వడగాల్పులు వీచే అవకాశం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం

విజయనగరం అర్బన్: జిల్లాలో సోమవారం 13 మండలాల పరిధిలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం ప్రజలను హెచ్చరించింది. ఈ మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వేపాడ మండలంలో 44.4, జామిలో 43, గజపతినగరంలో 42.5, బొండపల్లిలో 42.2, గంట్యాడలో 41.9, మెంటాడలో 40.8, కొత్తవలస, దత్తిరాజేరులో 40.3 సెంటిగ్రేట్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. వీటితో పాటు ఎల్.కోటలో 39.6, గుర్లలో 39.5, రామభద్రపురంలో 38.3, ఎస్.కోటలో 35.8 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ మండలాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

పెంటలో గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభం



దుర్గమ్మ ఘటాలతో భక్తులు

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామంలో గ్రామ దేవతల (దేశమ్మ, మెట్టమ్మ, బంగారమ్మ) ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బొమ్మి వారి ఇంటి నుంచి ఆదివారం దుర్గమ్మ ఘటాలను ఊరేగించారు. సోమవారం తొలేళ్లు, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపు ఉంటుందని బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచనలతో గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.

జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా రాంబాబు



మజ్జి రాంబాబు

రామభద్రపురం: రామభద్రపురం మండలం మిర్తివలస గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి రాంబాబు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ పదవీ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం, పల్లెల అభివృద్ధి కోసం తన వంతు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. విద్యాధికుడు, పంచాయతీరాజ్ చట్టంపై పట్టున్న రాంబాబు మొదటిసారి సర్పంచ్‌గా ఎన్నికై జిల్లా స్థాయిలో గుర్తింపు పొందినందుకు ఎమ్మెలే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పలువురు సర్పంచ్‌లు అభినందించారు.

నేటి నుంచి పరదేశమ్మ జాతర



పరదేశమ్మ అమ్మవారు

జామి: మండలంలోని కలగాడ గ్రామంలో గ్రామదేవత పరదేశమ్మ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, రథయాత్రతో పాటు గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 17న మధ్యాహ్నం ఎడ్ల పరుగు పందాలు ఉంటాయన్నారు. పరిసర గ్రామాల ప్రజలు జాతరకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చెరువుల రూపురేఖలు అందంగా ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు తెచ్చిన అమృత్ సరోవర్ పథకం జిల్లాలో మంచి ఫలితాలనే సాధించింది. ఈ పథకం కింద చేపట్టిన చెరువులు చూపరులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. చూడగానే ఇక్కడే కాసేపు ఉండాలనే ఆలోచన కలిగేలా వీటిని తీర్చిదిద్దారు. గతంలో ఉన్న చెరువుల రూపురేఖలు ఇలా మారిపోయాయా! ఔరా.. అనిపించేలా చేశారు. మొత్తంగా ఈ పథకం అమల్లో రాష్ట్రంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

'అమృత్ సరోవర్'లో

జిల్లా ఫస్ట్

- 'అమృత్ సరోవర్'తో ఆహ్లాదం
- ఉపాధి హామీ నిధులతో జిల్లాలో 90 చెరువుల నిర్మాణం
- భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం
- చెరువుల నిర్మాణానికి వెచ్చించిన నిధులు రూ.8 కోట్లు
- 28 లక్షల పని దినాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న చెరువు అమృత్ సరోవర్ పథకం కింద నిర్మించింది. భోగాపురం మండలం నందిగాం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించారు. చెరువు నిర్మాణంలో 192 మంది వేతనదారులు పని చేశారు. చెరువు నిర్మాణానికి వేతనదారులకు వెచ్చించింది రూ.2.42 లక్షలు. దీనిని ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దారు. చెరువును చూడగానే ఎవరికైనా కాసేపు గడపాలని ఆలోచన వచ్చేలా రూపొందించారు. అంతేకాకుండా గ్రామస్తులు కోసం వాకింగ్ ట్రీట్‌ను కూడా తయారు చేశారు. జిల్లాలో అనేక చెరువులను అమృత్ సరోవర్ పథకం కింద ఇలానే తీర్చిదిద్దారు.

విజయనగరం ఫోర్ట్:

అమృత్ సరోవర్ పథకం కింద చేపట్టిన చెరువుల నిర్మాణాలు ఆహ్లాదానికి చిరునామాగా నిలుస్తున్నాయి. జిల్లాలో 90 చెరువులను అమృత్ సరోవర్ పథకం కింద నిర్మించారు. గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులను ఎంచుకుని ఆహ్లాదం ఉట్టిపడేలా నిర్మించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెంచాలన్న లక్ష్యంతో అమృత్ సరోవర్ చెరువులను తీర్చిదిద్దారు. వీటితో పాటు స్థానికులు నడవడానికి వీలుగా వాకింగ్ ట్రీట్‌ను నిర్మిస్తున్నారు. నేమ్ బోర్డు, గేటు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా వీటిని అందాల చెరువులుగా మార్చుతున్నారు. చూసే వారికి ఔరా అనిపించేలా చేస్తున్నారు.

జిల్లాలో 90 చెరువుల నిర్మాణం

అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 90 చెరువులు నిర్మించారు. చెరువుల నిర్మాణం అంతా ఉపాధి వేతనదారులే చేపట్టారు. వీటి నిర్మాణానికి రూ.8 కోట్లు వరకు నిధులు ప్రభుత్వం



చెరువు నేమ్ బోర్డు

వెచ్చించింది. వేతనదారులకు 28 లక్షల పనిదినాలు కల్పించారు.

రాష్ట్రంలో జిల్లా ఫస్ట్

అమృత్ సరోవర్ చెరువుల నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని చెరువుల నిర్మాణం చేపట్టారు. అంతే కాకుండా చెరువులన్నింటిని అత్యంత నాణ్యతతో, పచ్చదనం ఉట్టిపడే విధంగా నిర్మించారు. జిల్లాలో 3.45 జాబ్ కార్డులు ఉన్నాయి. 6 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. అమృత్ సరోవర్ చెరువుల నిర్మాణం చేపట్టడం వల్ల రెండు ప్రయోజనాలు చేకూరుతున్నాయి. చెరువుల తవ్వడం వల్ల ఉపాధి హామీ వేతనదారులకు పని కల్పించబడుతుంది. మరోవైపు అందమైన చెరువుల నిర్మించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుంది. అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 12 చెరువులు చొప్పున నిర్మించారు. ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో చెరో 12 చెరువుల చొప్పున, ఒకటి రెండు చోట్ల అంత కంటే ఎక్కువగా నిర్మాణం చేపట్టి అందంగా తీర్చిదిద్దారు.

అందంగా తీర్చిదిద్దాం..

అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో పలు చెరువు ల నిర్మాణం చేపట్టాం. చెరువులను అందంగా తీర్చిదిద్దాం. చెరువు గట్టుపై వాకింగ్ ట్రీట్, గార్డెన్ ఏర్పాటు చేస్తున్నాం. చెరువుల ను ఆహ్లాదకరంగా నిర్మించడం వల్ల స్వచ్ఛమైన వాతావరణం నెలకొంటుంది.

– జి.ఉమామహేశ్వరి, పీడీ, డ్వామా

ప్లకార్డులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



ఈనాడుపై జనాగ్రహం

- వాస్తవాలను వక్రీకరిస్తే తగిన గుణపాఠం తప్పదు
- 'ఈనాడు' దినపత్రిక ప్రతులను తగులబెట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విజయనగరం:

ఈనాడు తప్పుడు రాతలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం చేపట్టిన నిరసనకు ప్రజలు మద్దతు తెలిపారు. ఈనాడు తప్పుడు రాతలు మానుకోవాలి.. లేకుంటే గుణపాఠం తప్పదంటూ నినదించారు. నగరంలో ఆర్అండ్‌బీ జంక్షన్‌లోని ఈనాడు కార్యాలయం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించి అక్కడ ఈనాడు దినపత్రిక ప్రతులను దగ్ధం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని కేఎల్‌పురం ప్రాంత ప్రజలకు తాగునీరు అందడం లేదంటూ ఈనాడు ప్రచురించిన కథనంపై కార్పొరేషన్ కార్పొరేటర్లు మండిపడ్డారు. ర్యాలీలో తప్పుడు రాతలు రాస్తున్న ఈనాడు డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా 45వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషికుమారి, 39వ డివిజన్ కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేఎల్ పురంలో దశాబ్దాల కాలంగా తాగునీటి పైపులైన్లు లేకపోవడంతో వాటర్ ట్యాంకర్ల ద్వారానే తాగునీటి సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు అవసరమైన మేరకు రోజుకు 3 ట్యాంకర్ల నీటిని ప్రస్తుత వేసవిలో సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి



ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఇచ్చిన హామీ మేరకు కేఎల్‌పురంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.2కోట్లతో వాటర్ ట్యాంకు నిర్మించడం జరుగుతుందన్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.98 లక్షలతో తమ ప్రాంతం పరిధిలో పైప్‌లైన్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయటం జరిగిందని, పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వాటర్ ట్యాంక్ నిర్మాణ దశలో ఉన్న పరిస్థితిని ఈనాడు దినపత్రిక ప్రతినిధులు గమనించకుండా ప్రజలు ఇక్కట్లు పడుతున్నారనే విధంగా తప్పుడు వార్తలను ప్రచురించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా ఈనాడు తప్పుడు వార్తలను ప్రచురించడం క్షమించరానిదని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి నిరాధార వార్తలు ప్రచురించినట్లయితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలు డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిజ్రా సంకల్పం

అందమైన ఆడపిల్లలా ముస్తాబవుతారు. అందరినీ ఆకర్షించాలని ఆరాటపడతారు. బయటకు వారు అదోటైపులా కనిపించినా.. వారి మనసు వెన్నకంటే మిన్న. ఏ ఒక్కరు ఆపదలో ఉన్నా తట్టుకోలేరు. సేవల్లో ముందుంటారు. దీనికోసం విజయనగరంలో ప్రత్యేకంగా హెల్పింగ్‌హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్‌ను స్థాపించారు. సంస్థ తరపున దశాబ్దాల తరబడి నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్నారు. అనాథలైన ఆడపిల్లలకు పెళ్లిళ్లు.. ఆకలితో అలమటించేవారికి అన్నదానం.. అనాథ శవాలకు దహన సంస్కారాలు.. పేద పిల్లలకు చదువులు.. ఇలా.. ఎవరికి ఏ అవసరం, ఆపద వచ్చినా మేమున్నామని భరోసా ఇస్తున్నారు. విజయనగర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా హిజ్రాలు చేస్తున్న సేవలకు 'సాక్షి' అక్షరరూపం.



- విద్యార్థుల చదువుకు సాయం
- నిత్యాన్నదానం
- అనాథ పిల్లలకు పెళ్లిళ్లు
- అనాథ శవాలకు దహన సంస్కారాలు
- అర్చకులుగా అమ్మవారికి సేవలు
- హెల్పింగ్‌హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ పేరిట విస్తృత సేవాకార్యక్రమాలు
- ప్రతిచోట ప్రత్యేకత చాటుతున్న హిజ్రాలు
- విజయనగర ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న మంచి మనుషులు



ఆలయంలో అర్చకులుగా పూజలు చేస్తున్న హిజ్రాలు

విజయనగరం డెస్క్:

విజయనగరం నడిబొడ్డున ఉన్న పెద్దచెరువు గట్టుపై ప్రయాణించేవారికి శ్రీ విజయసాగర దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం దర్శనమిస్తుంది. అందులో అర్చకుల నుంచి నిర్వాహకుల వరకు అందరూ హిజ్రాలే. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తుల పేరుపై అర్చన జరుపుతారు. అమ్మవారి నిత్య కైంకర్యాలలో నిమగ్నమవుతారు. ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. నిండు మనసుతో ఆశీర్వదిస్తారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తారు. భక్తులు సమర్పించిన కానుకలను సమాజసేవకు వినియోగిస్తూ.. మానవ సేవే మాధవ సేవగా ముందుకు సాగుతున్నారు. హెల్పింగ్‌హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ పేరుతో సేవల్లో ప్రత్యేకతను చాటుతున్నారు.

25 ఏళ్లుగా...

హిజ్రా అసోసియేషన్ స్థాపించి సుమారు 25 ఏళ్లు గడుస్తోంది. ఇందులో 500 మంది సభ్యులు ఉండగా, క్రియాశీలకంగా పదిమంది సభ్యులు పనిచేస్తున్నారు. వీరిలో ఎవరు ఏ రకంగా డబ్బులు సంపాదించినా అందులో అధికమొత్తం సేవాకార్యక్రమాలకే వినియోగిస్తారు. విజయదుర్గమ్మ చల్లని కరుణతో ఆరోగ్యంగా ఉన్నామని, ఆమె ఇచ్చిన శక్తితో మరింత మందికి సేవచేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నది వారి మాట.

రాజుల కాలం నుంచి గుర్తింపు...

భారత దేశాన్ని పాలించిన రాజుల కాలం నుంచి హిజ్రాలకు గుర్తింపు ఉంది. అంతఃపురాల్లో రాజులు, సామంతులు, రాణులకు సలహాదారులుగా పనిచేసేవారు. రాజ్యపాలనలో లోటుపాట్లను, ప్రజల అభిప్రాయాలను తెలియజేయడంలో వీరి పాత్రే కీలకం. అదే స్ఫూర్తితో భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ముందుకు సాగుతున్నామని, నిత్యం చీరకట్టుతోనే కనిపిస్తూ.. భారతీయ మహిళల అలంకరణ ఔన్నత్యాన్ని చాటిచెబుతున్నామని పలువురు హిజ్రాలు తెలిపారు.

ఆశీర్వదిస్తే శుభం...

హిజ్రాలు ఆశీర్వదించినా, ఎదురొచ్చినా శుభం కలుగుతుందన్నది నానుడి. సనాతన కాలం నుంచి ఇది వస్తోంది. ఎందుకంటే వారు నిండుమనసుతో, స్వార్థరహితంగా ఆశీర్వదిస్తారని, వారి పుణ్యఫలం ఆశీర్వాదం రూపంలో అందుతుందని నమ్ముతారు. కొందరు వారికి దక్షిణ ఇచ్చి ఆశీర్వదించుకుంటారు. అయితే, హిజ్రాల్లో మూడు రకాలు ఉన్నాయని, కొందరు బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండడంతో తమ ఔన్నత్యం దెబ్బతింటుందని అసోసియేషన్ సభ్యులు కొందరు తెలిపారు. రైళ్లు, బస్టాండ్‌లలో మేము సేకరించే డబ్బుల్లో అధికమొత్తం సేవా కార్యక్రమాలకే వినియోగిస్తామని, ఆ పుణ్యం దాతలకు దక్కుతుందన్నారు. మమ్మలను చూసి ఛీదరించుకోవద్దంటూ సెలవిచ్చారు.

సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ..

హిజ్రాల్లో కొందరు సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యలనగరం సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు. పండగలు, జాతరులు.. తీర్థాలు ఇలా.. ఏ కార్యక్రమం జరిగినా చక్కని ప్రదర్శనలతో అలరిస్తున్నారు. వచ్చిన డబ్బులను సమాజ సేవకు వినియోగిస్తున్నారు. తల్లిదండ్రులను పోషిస్తున్నారు.

సేవలు ఇలా...

- విజయసాగర దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం వద్ద నిత్య అన్నదానం. రిక్షాపుల్లర్లు, కూలీలు, యాచకులు ఇలా... అందరికీ కడుపు నిండా భోజనం పెడుతున్నారు. ఇది దుర్గమ్మ తల్లి అన్నప్రసాదంగా వడ్డిస్తున్నారు.
- ఇప్పటివరకు అనాథలైన నలుగురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశారు. వారి కాపురాలకు కావాల్సిన సామగ్రిని మొత్తం సమకూర్చారు.
- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని 40 మంది పేదకుటుంబాల విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు.
- కరోనా సమయంలో రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రతిరోజు 200 మందికి అన్నదానం చేశారు.
- విజయనగరంలో ఎక్కడ అనాథ శవం ఉందని తెలిసినా వెంటనే వెళ్తారు. సంప్రదాయ బద్ధంగా దహనసంస్కారాలను పూర్తిచేస్తారు. ఇప్పటివరకు పదుల సంఖ్యలో అనాథ శవాలకు దహన సంస్కారాలు పూర్తిచేశారు.
- హిజ్రాలుగా ఉంటూ చదువులో ప్రతిభ చూపేవారికి సంస్థ తరపున అండదండలు అందిస్తున్నారు. సంస్థ సాయం చేసిన వారిలో ఇప్పటివరకు నలుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు ఎస్‌ఐలుగా ఎంపికయ్యారు. సివిల్స్‌లో రాణించేలా కొంతమంది విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. శిక్షణకు కావాల్సిన ఆర్థిక సాయం చేస్తున్నారు.

ఆదుకోవడంలోనే ఆనందం



మేము మా కోసం బ్రతకడం లేదు. సమాజం కోసం బతుకుతున్నాం. నిత్యం అమ్మవారి సేవలో ఉంటూనే సమాజానికి సేవలందిస్తున్నాం. మా హిజ్రాలందరమూ ఐక్యంగా అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుని 25 ఏళ్లుగా సేవల్లో ముందుకు సాగుతున్నాం. ఈ జన్మకు ఇది చాలు. ఆ తల్లి కరుణ అందరిపైనా చల్లగా ఉండాలి.

– స్రవంతి, హెల్పింగ్‌హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ కార్యదర్శి

హాని చేయొద్దు..



తెలిసి హాని తలపెట్టడం తప్పు. మనకు దేవుడు ఇచ్చిన జన్మను సార్థకత చేసుకోవాలి. మంచి మనసుతో ముందుకు సాగాలి. వీలుంటే సేవ చేయాలి. మా హిజ్రాలందరమూ ఒకే మాటపై నడుస్తాం. మాతో పాటు ఎవరు ఆపదలో ఉన్నా ఆదుకుంటాం. మేము సేకరించే ప్రతి పైసాను సమాజ సేవకు వినియోగిస్తాం. పేద పిల్లలను చదివిస్తున్నాం. అనాథ శవాలకు దహనసంస్కారాలు చేస్తున్నాం. వృద్ధులకు అండగా ఉంటున్నాం. అనాథులైన యువతులకు పెళ్లిళ్లచేసి కాపురాలు నిలబెడుతున్నాం. ఆ సంతృప్తి చాలు మాకు. విజయసాయి దుర్గామల్లేశ్వరస్వామికి నిష్ఠతో పూజలు చేస్తాం. అమ్మవారి చల్లని కరుణ అందరిపైనా ఉండాలి.

– నందిని, హిజ్రా అసోసియేషన్ సభ్యురాలు





అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం



అమ్మవారికి అభిషేకాలు



హిజ్రాలే అర్చకులుగా సాగుతున్న విజయనగరం పెద్దచెరువు గట్టుపై ఉన్న విజయసాగర దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బూర్లె మహేష్(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అప్పయ్యపేట గ్రామ సమీపంలో ఈ నెల 9న మనస్తాపంతో పురుగు మందు తాగేసిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామతీర్థం గ్రామానికి చెందిన స్వాతితో శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలంలోని అర్జునవలస గ్రామానికి చెందిన బూర్లె మహేష్(27)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. నాటి నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా తరచూ గొడవలు జరుగుతుండేవి. భార్య స్వాతితో పాటు కుటుంబ సభ్యులు ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం ఈ నెల 8న మహేష్ స్టేషన్‌కు హాజరు కాగా..అక్కడ జరిగిన గొడవతో మనస్తాపానికి గురై మరుసటి రోజు అప్పయ్యపేట సమీపంలో ఉన్న టేకు తోటలో పురుగు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పురుగు మందు తాగినట్లు స్నేహితులకు మహేష్ ఫోన్ చేసి చెప్పడంతో అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా..పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి ఏడాది వయసు గల పాప ఉంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రమ (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన వివాహిత రమ(26) ఆదివారం ఉదయం ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై ఎస్సై ముకుందరావు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం రాకోడు గ్రామానికి చెందిన రమకు ఎల్.కోట మండలం మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల చిన్నంనాయుడుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితంలో 5 సంవత్సరాల పాప, 3 సంవత్సరాల వయస్సు గల బాబు ఉన్నారు. కాగా రమ భర్త చిన్నంనాయుడు విశాఖపట్నం ఉద్యోగ నిమిత్తం వెళ్లగా శనివారం రాత్రి ఇంటిలో ఆమె ఒక్కతే పడుకుంది. ఆదివారం తెల్లవారాక చూసేసరికి ఉరికి వేలాడి కనిపించింది. వెంటనే స్థానికులు ఎల్.కోట పోలీసులకు సమాచారం అందజేయగా ఘటనా స్థలానికి ఎస్సై ముకుందరావు సిబ్బందితో కలిసి వచ్చి పరిశీలించారు.

వేధింపులే కారణం

తన కూతురు చావుకు అల్లుడు, అత్త, మామల వేధింపులు, శారీరకంగా హింసించడం, అల్లుడు చిన్నంనాయుడికి వివాహేతర సంబంధం ఉండడం కారణాలు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై భర్త దాడి


చికిత్సపొందుతున్న ఆదిలక్ష్మి

పార్వతీపురం: వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో ఓ భర్త, భార్యపై దాడిచేసి తీవ్రంగా ఆదివారం గాయపరియాడు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని వేమకోటివారి వీధికి చెందిన కె. ఆదిలక్ష్మి శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో భర్త కృష్ణ అనుమానంతో కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆదిలక్ష్మికి ముఖంపై పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆదిలక్ష్మిని కుమారుడు ద్విచక్రవాహనంపై చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800-00
బంగారం(22సి. 10గ్రా.)	56,650-00
వెండి (కిలో)	78,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

డ్రాగన్ పండు.. ఔషధ గుణాలు మెండు

- మార్కెట్‌లో మోజు..పెరుగుతున్న సాగు


ఎర్రగా, నల్లని గింజలతో డ్రాగన్ పండు లోపలిభాగం


ఎల్.కోట మండలం, కిత్తన్నపేట తోట వద్ద అమ్మకానికి తరలించేందుకు సిద్ధం చేసిన డ్రాగన్ పండ్లు


తోటలో కోత దశకు చేరువలో ఉన్న డ్రాగన్ పండ్లు

కొత్తవలస: విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్‌ఫ్రూట్‌ను చూడడమే అరుదు. అలాంటి పంటను జిల్లాలోని లక్కవరపుకోట, బొండపల్లి, డెంకాడ, శృంగవరపుకోట మండలాల్లో ఔత్సాహిక రైతులు చేపట్టారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా యువ రైతులు వాణిజ్య పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పండ్లతోటల సాగుతో పాటు మార్కెటింగ్ వ్యూహాన్ని పసిగట్టి, ఆర్థికంగా వెసులుబాటు ఉన్న రైతులు డ్రాగన్‌ఫ్రూట్ సాగు వైపు రావాలని జిల్లా ఉద్యాన వన శాఖ జాయింట్ డైరెక్టర్ జమదగ్ని పిలుపునిచ్చారు. డ్రాగన్‌ఫ్రూట్ పండ్ల తోటల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు, లాభాలను ఆర్జించవచ్చన్నారు. 'డ్రాగన్ ఫ్రూట్' సాగు గురించి ఆయన 'సాక్షి'తో మాట్లాడిని వివరాలు ఆయన మాటల్లోనే.. డ్రాగన్‌ఫ్రూట్‌ను తెలుగులో సిరి జమ్మెడ చెట్టు అంటారు. ఇది ఎడారి జాతికి చెందిన పండ్ల మొక్క. ఈ పండులో అనేక ఔషధగుణాలు ఉన్నాయి. ఈ పండులో శరీరానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. ఈ పండును తినడం ద్వారా బరువు నియంత్రణ, ఆస్తమా, చెడు కొలెస్ట్రాల్ తగ్గటం, డయాబెటిస్ నియంత్రణ లాంటి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

అన్ని రకాల నేలలు అనుకూలం..

డ్రాగన్‌ఫ్రూట్‌ను పండించేందుకు అన్ని రకాలైన నేలలు అనుకూలం. ముఖ్యంగా మంచి సేంద్రియ కర్బనంతో కూడిన ఇసుక నేలలు మరింత శ్రేష్టం. ఈ పంటకు నీటి అవసరం చాలా తక్కువ. పూత, కాయ సమయాల్లో 3-4 తడులు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

20 సంవత్సరాల వరకు పంట దిగుబడి..

ఈపంట ఒకసారి నాటితే 20 సంవత్సరాల వరకు దిగుబడిని ఇస్తుంది. స్తంభానికి నలు దిక్కులా 2 అడుగుల పొడవు, వెడల్పు, 1 అడుగు లోతు గుంతలు తవ్వాలి. గుంతకు 25 కిలోల పశువుల ఎరువు,


సంతపేట జంక్షన్ వద్ద డ్రాగన్ ఫ్రూట్‌లను అమ్ముతున్న రైతు


పూత దశలో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ తోట


డ్రాగన్‌ఫ్రూట్ సాగును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారులు

కిలో వేపపిండి వేసి మొక్కలు నాటాలి. నేలను బట్టి, సాగు చేసిన రకాలను బట్టి తడులను ఇవ్వాలి. నీరు ఎక్కువైతే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంది. సంవత్సరంలో రెండు సార్లు (జూన్/జనవరి) పశువుల ఎరువు వేసి సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సాధారణంగా డ్రాగన్ మొక్కలు తొలి కాపు కాయడానికి రెండు నుంచి మూడు సంవత్సరాల సమయం పడుతుంది. డ్రాగన్ సాగుకు ఎకరాకి రూ.3లక్షల నుంచి రూ.4 లక్షలు ఖర్చు అవుతుంది. ఎకరాకు దిగుబడి 6-8 టన్నుల వరకు వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌లో డ్రాగన్‌ఫ్రూట్ కేజీ ధర రూ.150 నుంచి 200 వరకు పలుకుతోందని ఉద్యాన వన శాఖ జాయింట్ డైరెక్టర్ జమదగ్ని వివరించారు.

ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాం



ఎస్.కోట మండలంలో తొలిసారిగా ప్రయోగాత్మకంగా డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నాం. ప్రస్తుతం ఎకరా విస్తీర్ణంలో సాగు చేపట్టాం. పంట ఆశాజనకంగా ఎదుగుతోంది. ఉద్యానవన శాఖ సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం.

– ఆదారి నాగేషు, రైతు.ఎస్.కోట.

జిల్లాలో ప్రోత్సహిస్తున్నాం

జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నేలలు డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం నాలుగు మండలాల్లో సాగు చేస్తున్నారు. డ్రాగన్ సాగు చేస్తామన్న రైతాంగానికి కావాల్సిన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. సాంకేతిక నైపుణ్యాన్ని ఇస్తున్నాం.

– ఏవీఎస్.జమదగ్ని, జిల్లా ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్.

వేడుకగా హనుమాన్ శోభాయాత్ర

- జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన పట్టణం
- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్ దాస్ ప్రసంగం
- అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు, బైక్ ర్యాలీ


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఆధ్యాత్మిక గురువు రాధామనోహర్ దాస్


భక్తుల కోలాటం ప్రదర్శన

విజయనగరం టౌన్/విజయనగరం: హనుమత్ జయంతిని పురస్కరించుకుని హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో భారీ హనుమాన్ విగ్రహంతో పట్టణంలోని కోట జంక్షన్ వద్ద ఆదివారం పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించారు. జై శ్రీరామ్ నినాదాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్ దాస్ పాల్గొని, హిందూతత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. హిందూమతాన్ని విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. పురాణ ఇతిహాస గ్రంథాల ప్రాముఖ్యతను, వాటి అర్థాన్ని వివరించారు. నగరంలోని కోట జంక్షన్ నుంచి ప్రారంభమైన శోభాయాత్రను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కౌశిక్ దంపతులతో పాటు ఆధ్యాత్మిక గురువు రాధామనోహర్‌దాస్‌లు ప్రారంభించారు. కోట జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మూడు లాంతర్లు, వెంకటలక్ష్మి థియేటర్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తిరిగి కోట జంక్షన్ వరకూ సాగింది. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి శ్యామ్‌సుందర్, జిల్లా అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి శఠగోపం పార్థసారథి, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న భక్తులు


ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి,ఆధ్మాత్మిక గురువు రాధామనోహర్‌దాస్‌లు

కరాటే పోటీల్లో రాజాం విద్యార్థుల సత్తా


విజేతలను అభినందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

రాజాం: మాస్టర్ సాయిబాబా మెమోరియల్ నేషనల్ లెవెల్ కుంగ్-ఫూ అండ్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో రాజాం పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఫస్ట్ నేషనల్ లెవెల్ పోటీలు జరగగా రాజాం కరాటే అకాడమీకి చెందిన హేమకేష్, తన్విక, రిషిక, శ్రీకరణ్‌లు కుమితీ ఫైటింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. కాటా విభాగంలో సూర్యచంద్ర, శ్రీజ్ఞానవిలు వెండి పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ ఆర్.శివ వెల్లడించారు. ఈ విభాగంలో నితీష్‌కు కాంస్య పతకం లభించిందని చెప్పారు. వీరిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతి తదితరులు వైఎస్ఆర్ సీపీ కార్యాలయం వద్ద అభినందించారు. జాతీయ స్థాయిలో పలు కరాటే పోటీల్లో పాల్గొని మరిన్ని బహుమతులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అనూరాధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి డయేరియా కేసుల తాకిడి


ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న డయేరియా రోగులు

బాడంగి: స్థానిక కమ్యూనిటీ ప్రభుత్వాస్పత్రికి రెండురోజులుగా డయేరియా రోగుల తాకిడి పెరుగుతోంది. ఆస్పత్రిలో 30పడకలే ఉండగా రోగుల సంఖ్యపెరిగిపోతుండడంతో గదులుచాలక ఆస్పత్రి వరండాలో మంచాలు, బెంచీలపై రోగులకు చికిత్స చేస్తున్నారు.ఆదివారం ఆస్పత్రిలో చికిత్సపొందిన వారిలో బొత్స జానకి(రామచంద్రాపురం), వెంపడాపు ఆదెమ్మ (బాడంగి), పి.చంటి (కోడూరు),లచ్చుపతుల తిరుపతి (వీరసాగరం), కొల్లూరి ముగడమ్మ (పిన్నవలస)వెంపడాపు సీతయ్య(రావివలస), కె.సుభాషిణి (లక్ష్మీపురం) మరికొంతమంది ఉన్నారు. ఇదేవిషయమై డాక్టర్ రాజారమేష్ వద్ద ప్రస్తావించగా వేవికాలం ఎండలు ముదిరిపోగా పెళ్లిళ్లు, పండగల భోజనాలు, బావులు, బోర్లలో అడుగంటిన నీరు తాగడంవల్ల విరోచనాలు ఎక్కువగా అవుతున్నట్లు చెప్పారు. కావున ప్రజలు వేసవిలో క్యాంపులు, మాసాలాహారాలు తగ్గించుకోవాలని, గంజి, మజ్జిగవంటి పలుచని పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

అ'పూర్వ' కలయిక



ఆత్మీయ కలయికలో భాగస్వాములైన పూర్వ విద్యార్థులు

- విద్యార్థులతో సందడిగా మారిన శ్రీరామ్ హైస్కూల్
- 2003-04లో చదువుకున్న పూర్వ విద్యార్థుల హాజరు
- ఉపాధ్యాయులకు సన్మానం

చీపురుపల్లి రూరల్(గరివిడి):

వారంతా ఇరవైఏళ్ల క్రితం చదువుకున్న గరివిడి శ్రీరామ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (ప్రస్తుతం ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్). పాఠశాల చదువుల అనంతరం ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇరవైఏళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులంతా ఒకచోట కలవాలని అనుకున్నారు.ఈ కలయికకు తాము చదువుకున్న పాఠశాలనే వేదికగా ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. స్థానికంగా స్థిరపడిన వారితో పాటు వేరే ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అంతా ఈ ఆత్మీయ కలయికలో భాగస్వాములయ్యారు. అప్పుడెప్పుడో చదువుకున్న వారంతా ఒక్కసారిగా కలిసి ఒకరినొకరు హత్తుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు చదువుకున్నప్పుడు చేసిన అల్లరి, ఆటపాటలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి సామూహిక భోజనాలను ఆరగించారు. ఈ ఆత్మీయ కలయికలో భాగంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి వారి నుంచి దీవెనెలు అందుకున్నారు.పూర్వ విద్యార్థుల కలయికతో పాఠశాలలో మరోసారి సందడి నెలకొంది.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జామి: మండలంలోని అలమండ గ్రామం సమీపంలో చెరువు వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జామి ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం నలుగురు పేకాట రాయుళ్లను పట్టుకుని రూ.22,620 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాట రాయుళ్లపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేత


ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న 104 ఎమ్ఎమ్‌యు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు,సభ్యులు

సాలూరు:

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర 104 ఎమ్ఎమ్‌యూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఉపముఖ్యమంత్రి,గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 104,ఎమ్ఎమ్‌యు వాహన ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పిస్తామని, వేతనాల పెంపు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తమను ఆప్కాస్/కాంట్రాక్ట్‌లో అబ్జార్బ్ చేసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

2 B/R Flat, Car Park, Loan can be arranged, 100% Vastu, @R & B Guest House Road, Alkananda Colony, VZM. Ph : 92466 24248, 98494 73817 [V- 776936]

TO-LET

Vizianagaram Shop for Rent, Ambatisatram Jn., East facing. Cont: 9866467083 [S-1195837]

BUSINESS OFFER

ట్రేడింగ్ ద్వారా నెలకు లక్ష రూపాయలు సంపాదించుకొనే అద్భుత అవకాశం. Ph: 7013168624 [H-796783]

IRON FOR SALE

142 Double cots, made of iron are available for sale in vizianagaram. Suitable for hostel students. Cont: 8639914408 [S-1195836]

SERVICES

అతి సులభంగా రుణాలు పొందండి. వ్యాపారం ప్రాపర్టీ మార్క్ షీట్ వ్యక్తిగత LIC వ్యవసాయ భూమిపై తక్కువ దస్తావేదులతో పొందండి. 9505973750, 8096532189. [T-70]

WANTED

ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786248]

VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-165]

బ్యాంక్స్‌లో పర్మినెంట్‌గా (Office work) ఖాళీలు : 210 Q: 10th-డిగ్రీ, కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, క్యాషియర్స్, PO's జీ॥ 24000/- Ph:7816010774 [H-781424]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 9848571888 [H-793424]

Job Vacancy: Age:18 to 30, 10th to Any Degree, Office Job 18000 to 25000/- work from home 15000 to 18000/- ✆ 8074612837. [T-774025]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.